క్లుప్తంగా

అలరించిన నృత్య ప్రదర్శన



సంప్రదాయ నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద సికింద్రాబాద్‌కు చెందిన పద్మావెంకటేశ్, వారి బృందం వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన నిర్వహించారు. వినాయక పంచరత్నాలు, మహిషాసురమర్దిని, శివ తాండవం, శంభో శివశంభో, అయిగిరినందిని, శివశివశంకరా తదితర గీతాలకు లాస్య, లక్షిత, సునంద, గాయత్రీఅరుణ్ కుమార్, సంకీర్తన, కీర్తన, గాయత్రి, భవానీ మోహన్ తదితరులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

చట్టాలపై అవగాహన అవసరం



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ జగన్ మోహన్

మిడుతూరు: చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ జగన్‌మోహన్ సూచించారు. శనివారం మండల పరిధిలోని తలముడిపి గ్రామంలో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ అమల్లోకి వస్తున్న కొత్త క్రిమినల్ చట్టాలను అవగాహన చేసుకోవాలన్నారు. గ్రామంలో చిన్నచిన్న విషయాలకు ఘర్షలకు దిగి కేసుల్లో చిక్కుకోవద్దని హితవు పలికారు.

మహానందిలో భక్తజన సందడి



దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

మహానంది: మహానంది ఆలయంలో శ్రావణ మాసం, వీకెండ్‌ను పురస్కరించుకుని శనివారం భక్తుల రద్దీ నెలకొంది. ఆలయానికి వచ్చిన భక్తులు కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి ముందుగా ఆలయ ప్రాంగణంలోని ధ్వజస్తంభం, నంది స్థూపం, నాగులకట్టను దర్శించుకున్నారు. శ్రీకామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి వారిని దర్శించుకుని అభిషేకం, అర్చనలు చేశారు.

మహానందిలో వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు


మహానంది: మహానంది పుణ్యక్షేత్రానికి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపుతున్నట్లు మహానంది ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. మహానంది ఆలయ పరిసర ప్రాంతాల్లో శనివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. నిబంధనలకు వ్యతిరేకంగా ప్రయాణిస్తున్న వాహనాలకు జరిమానా విధించారు.

ఆత్మకూరులో వర్షం



ఆత్మకూరు: పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం వేకువజామున మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. 27.3 మి.మీ. వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు బవనాసి, గుండ్లకమ్మ, సుద్దవాగులకు వరద ప్రవాహం కొనసాగుతోంది. రోజూ వర్షాలు కురుస్తుండడంతో మొక్కజొన్న, కంది, మినుము పంటలు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎస్టీ పాఠశాలలో పారిశుద్ధ్య పనులు



బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న సిబ్బంది

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంటలోని గిరిజన గురుకుల పాఠశాల పరిసరాల్లో పంచాయతీ సిబ్బంది శనివారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న కొట్టాలచెరువు గ్రామానికి చెందిన ఓ విద్యార్థికి డెంగీ రావడంతో గ్రామ పంచాయతీ, సచివాలయ, వైద్యారోగ్యశాఖ సిబ్బంది పాఠశాల పరిసరాల్లో చెత్తా చెదారాన్ని తొలగించారు. దోమల నివారణ మందును పిచికారీ చేయించారు.

అయ్యో ‘భౌ’బోయ్

- వీధుల్లో వీధి కుక్కల వీరంగం
- హడలిపోతున్న పట్టణ ప్రజలు
- కుక్క కాటుకు గురవుతున్న వృద్ధులు, చిన్నారులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



ఆత్మకూరులో సంచరిస్తున్న కుక్కలు

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో వీధి కుక్కలు వీరంగం సృష్టిస్తున్నాయి. కుక్కల బెడదతో ప్రజలు హడలిపోతున్నారు. పట్టణంలోని 24 వార్డుల్లోని ఏ వీధిలో చూసినా కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. పలు కాలనీల్లో ప్రజలు ఇంటి నుంచి బయటకు రావాలంటే జడుసుకుంటున్నారు. ఆత్మకూరు పట్టణంలో సుమారు 2 వేలకు పైగా వీధి కుక్కలు ఉన్నాయి. ప్రధానంగా కొత్తపేట, వాకిలిపేట, ఎస్సీజీపాలెం, ఏబీఎం పాలెం, ఇందిరా నగర్, అర్బన్‌కాలనీ, వెంగళరెడ్డినగర్, రహమత్ నగర్, ఏకలవ్యనగర్, సాయిబాబనగర్, మెయిన్ బజార్ తదితర కాలనీల్లో కుక్కలు అధికంగా సంచరిస్తున్నాయి. సమస్యపై ప్రజలు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదు.

కౌన్సిల్ సమావేశంలో చర్చించినా ఫలితం శూన్యం

ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో కుక్కల బెడద అధికంగా ఉందని పలుమార్లు మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో సభ్యులు ప్రధానాంశంగా చర్చించారు. మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయితే ఇచ్చిన హామీ నేటికి అమలుకు నోచుకోవడం లేదు. ఇటీవల కుక్కలు అధికం కావడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులు అంతా ఇంతా కావు. ఇళ్ల నుంచి బయటికి వెళ్లిన వారు సురక్షితంగా వస్తారా లేదా అని ఆందోళన నెలకొంది.

20 మందికి కుక్కకాటు

పట్టణంలో ఇటీవల కుక్కల బెడద అధికం కావడంతో ప్రజలు బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. బైకులు, సైకిళ్లపై వెళుతున్నా వెంట పడుతున్నాయి. వాటి నుంచి తప్పించుకునే క్రమంలో పలువురు గాయపడ్డారు. ఈ నెలలో 5 మంది కుక్క కాటుకు గురయ్యారు. ఈ ఏడాది జూన్ నుంచి ఇప్పటి వరకు సుమారు 20 మందికి పైగానే కుక్క కాటుకు గురై ఆస్పత్రి పాలయ్యారు. గతంలో ఇంటి నుంచి తినుబండారాల కోసం దుకాణానికి వెళ్లిన ఓ చిన్నారిని తీవ్రంగా కుక్కలు గాయపరిచిన సంఘటన జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇలాంటి సంఘటనలు కోకొల్లలుగా జరిగాయి. రెండేళ్ల క్రితం ఆత్మకూరు పట్టణంలో కుక్కకాటుకు బాలిక తీవ్రంగా గాయపడగా అప్పటి ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి స్పందించి డీఎంహెచ్‌ఓతో మాట్లాడి చిన్నారికి మెరుగైన వైద్యసేవలు అందించారు.

పట్టించుకోని మున్సిపల్ అధికారులు

పట్టణంలో విచ్చలవిడిగా కుక్కలు సంచరిస్తూ వృద్ధులు, చిన్నారులను కాటువేస్తున్నా మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్‌ను కలిసి ప్రజలు కుక్కల బెడద నుంచి రక్షించమని వినతిపత్రాలు అందించినా అధికారుల నుంచి స్పందన కరువైంది. ఇటీవల పలు కాలనీల్లో పిచ్చికుక్కలు స్వైర్య విహారం చేస్తున్నాయి. కనిపించిన వారిపై దాడికి పాల్పడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.

బయటకు వచ్చేందుకు భయపడుతున్నాం



పట్టణంలో కుక్కలు అధికంగా ఉండడం వల్ల భయాందోళనకు గురవుతున్నాం. ఏ వీధిలో చూసినా కుక్కల సంచారం అధికమైంది. ప్రజలు అధికంగా సంచరించే ప్రధాన కూడళ్లలో గుంపులుగా సంచరిస్తున్నాయి. ఎప్పుడు దాడి చేస్తుందోనని ఆందోళనకు గురవుతున్నాం. అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాల్సిన అవసరం ఉంది.

–బాషా, ఆత్మకూరు

చర్యలు తీసుకుంటున్నాం

పట్టణంలో కుక్కల బెడద అధికంగా ఉన్నట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. కుక్కల బెడద నివారణకు నంద్యాల అధికారులతో చర్చించి, త్వరలోనే కుక్కలను పట్టుకునేందుకు ప్రయత్నిస్తాం. అవసరం అయితే పశువైద్యశాల అధికారులతో చర్చించి కుక్కలు లేకుండా నియంత్రించేందుకు టీకాలు వేయిస్తాం.

– హరిప్రసాద్, మున్సిపల్ కమిషనర్

రేపటి నుంచి సర్పంచ్‌లకు శిక్షణ

పగిడ్యాల: ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఉంటుందని ఎంపీడీఓ కవిరాజ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శానిటేషన్, ఎస్‌డబ్ల్యూఎం, జీపీడీపీ, వీధిలైట్లు తదితర అంశాలపై మూడు రోజులు శిక్షణ ఉంటుందని, తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

మహానంది తహసీల్దార్ రమాదేవి

మహానంది: మహానంది తహసీల్దార్‌గా పాణ్యం డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న రమాదేవిని నియమిస్తూ నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి ఉత్తర్వుల జారీ చేశారు. త్వరలో రమాదేవి బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది. కాగా ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాసులు నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

నందికొట్కూరు రూరల్ సీఐగా సుబ్రమణ్యం

నందికొట్కూరు: నందికొట్కూరు రూరల్ సీఐగా సుబ్రహ్మణ్యంను ప్రభుత్వం నియమించింది. ఇక్కడి రూరల్ సీఐ బీఆర్ కృష్ణయ్యను వీఆర్‌కు పంపి.. సత్యసాయి జిల్లా ధర్మవరం సీఐ సుబ్రహ్మణంను ఇక్కడికి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలో ఆయన బాధ్యతలు స్వీకరించనునట్లు సమాచారం.

మొక్క జొన్నకు అడవి పందుల ముప్పు



ధ్వంసమైన పంటను చూపుతున్న రైతు రమణ

ఆత్మకూరురూరల్: అసలే ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఆత్మకూరు మండలంలో మొక్కజొన్న పంట రైతుల చేతికి వచ్చేలా కనిపించడంలేదు. అంతో ఇంతో కాసిన మొక్కజొన్న చేలపై అడవి పందుల దాడులు తీవ్రంగా ఉంటున్నాయి. రాత్రికి రాత్రే మొత్తం పొలంలోని మొక్కజొన్న కంకులనన్నింటిని స్వాహా చేస్తూ విధ్వంసం సృష్టిస్తున్నాయి. ఆత్మకూరు మండలం కరివేన గ్రామానికి చెందిన రమణ అనే కౌలు రైతు పది ఎకరాల్లో మొక్క జొన్న పంట వేశాడు. అంతా బాగా ఉంది అనుకుంటున్న సమయంలో శుక్రవారం రాత్రి అడవి పందులు చేనుపై పడి విధ్వంసం సృష్టించాయి. సుమారు 3 ఎకరాల్లో కంకులను తినేశాయి. అటవీ అధికారులు రమణకు కలిగిన నష్టాన్ని అంచనా వేసి తగిన నష్ట పరిహారం ఇవ్వాలని గ్రామ పెద్దలు కోరుతున్నారు.

కుమారస్వామికి విశేష పూజలు



పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: షష్ఠిని పురస్కరించుకుని శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల ఆలయ ప్రాంగణంలోని కుమార స్వామి ఉపాలయంలో శనివారం విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ చేసి నైవేద్యం సమర్పించారు. అష్టోత్తరం, స్తోత్రపారాయణాలు చేశారు.

పైపులైన్‌కు మరమ్మతులు



మరమ్మతులు చేయిస్తున్న సర్పంచ్ వరప్రసాద్

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామంలో సర్పంచు వరప్రసాద్ శనివారం పైప్ లైన్ల మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షపు నీరు పైపుల్లోకి వెళ్లి తాగు నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండండి



శివపురంలో అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ హరిప్రసాద్

కొత్తపల్లి: ప్రజలు ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ హరిప్రసాద్ సూచించారు. శనివారం మండల పరిధిలోని శివపురం గ్రామంలో పర్యటించారు. గ్రామస్తులతో ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల ఫోన్‌కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. సైబర్‌నేరాలపై జాగ్రత్త వహించకపోతే మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఎవరైనా సైబర్ నేరాలకు, ఆన్‌లైన్ మోసాలకు గురైతే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు.

విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయండి



సంఘీభావం తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నందికొట్కూరు: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్ట్ ప్రకటన దృష్ట్యా నిర్వహించనున్న విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు స్వాములు, గిత్త ప్రతాప్ కోరారు. శనివారం అల్లూరులోని మాదిగపేటలో ఎమ్మార్పీఎస్, బుడగ జంగాల నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఈనెల 13న హైదరాబాద్‌లో జరిగే విజయోత్సవ ర్యాలీకి పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు. కార్యక్రమంలో బేడ బుడగ జంగం జాతీయ నాయకులు తాటికొండ నారాయణ, ప్రధాన కార్యదర్శి సిరివాటి లక్ష్మయ్య, రాష్ట్ర అధ్యక్షులు తూర్పాటి మనోహర్, స్థానిక నాయకులు మోతే పెద్దన్న సుంకన్న, శేఖర్, వెంకటేశ్వర్లు, సుంకన్న, శేఖర్, రమణయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ పతాకావిష్కరణ



జెండా ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

వెలుగోడు: యూటీఎఫ్ స్వర్ణోత్సవం సందర్భంగా స్థానిక కార్యాలయ ప్రాంగణంలో శనివారం పతాకావిష్కరణ చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ నాగస్వామి నాయక్ మాట్లాడుతూ.. ''అధ్యయనం– అధ్యాపనం– సామాజిక స్పృహ'' యూటీఎఫ్ నిర్మాణానికి ప్రధాన భూమికలని అభివర్ణించారు. విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయ సంక్షేమం రెండు కళ్లు వంటివని.. సమ సమాజ నిర్మాణానికి, ఉత్తమ పౌరులను తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రామకష్ణ, జాకీర్ హుస్సేన్, సుబ్రహ్మణ్యం, జేఎండీ రఫీ అహ్మద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లు చెల్లింపులో సరికొత్త విధానం

- ఏపీసీపీడీసీఎల్ యాప్‌లో మరిన్ని ఫీచర్లు
- విద్యుత్ వినియోగం తెలుసుకునే వెసులుబాటు
- అందుబాటులోకి గత చెల్లింపుల వివరాలు



విద్యుత్ సబ్ స్టేషన్



నందికొట్కూరు: రిజర్వ్‌బ్యాంక్ ఆదేశాలతో భారత్ బిల్లు పేమెంట్ మార్గదర్శకాలకు అనుగుణంగా విద్యుత్ బిల్లుల చెల్లింపులలో నూతన విధానం అందుబాటులోకి వచ్చింది. యూపీఐ యాప్స్‌లో పలు బిల్డింగ్ పేమెంట్స్ అందుబాటులోకి వచ్చాక అందులోనే చెల్లింపులు చేస్తున్నారు. ప్రస్తుతం ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం యూపీఐ యాప్స్‌లో పేమెంట్ ఆప్షన్ తీసివేశారు. కరెంట్ బిల్లులు చెల్లించాలంటే విద్యుత్‌శాఖ వెబ్‌సైట్‌లో నేరుగా చెల్లించే అవకాశం కల్పించారు. ఏపీసీపీడీసీఎల్ యాప్ లేదా వెబ్‌సైట్‌లో కరెంట్ బిల్లులు చెల్లింపుతో పాటు సర్వీసు పరంగా పలు వివరాలు తెలుసుకునే అవకాశాలు కల్పించారు. ఈ ఏడాది జూలై–1 నుంచి యాప్‌లలో మాత్రమే విద్యుత్ బిల్లులు చెల్లించాలి.

అందుబాటులోకి కొత్త ఫీచర్లు ..

గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఏపీసీపీడీసీఎల్ మొబైల్ యాప్‌ను డౌన్‌లోడు చేసుకుని వినియోగదారులు 13 అంకెల సర్వీస్ నంబరు నమోదు చేసుకోవడం ద్వారా యాప్ సేవలను పొందవచ్చు. ఇందులో రిజిస్టర్ సెల్ నంబరుతో రిజిస్ట్రేషన్ చేసుకుని లాగ్‌ఇన్ ఇవ్వాలి. తర్వాత యాప్‌లో బిల్ పే ఆప్షన్ ద్వారా విద్యుత్ బిల్లులను ఎలాంటి అదనపు రుసుం లేకుండా సులభంగా చెల్లించవచ్చు. వినియోగదారు సర్వీసులకు సంబంధించి విద్యుత్ వియోగం బిల్లు వివరాలు, బిల్లు చెల్లింపు, విద్యుత్ సరఫరా పరిస్థితి వివరాలు తెలుసుకునేలా సరికొత్త 9 ఫీచర్లు అందుబాటులోకి తెచ్చారు.

సమస్తసమాచారం యాప్‌లోనే..

ఈ యాప్‌లో పేమెంట్ హిస్టరీలో ప్రతినెలా చెల్లించిన బిల్లుల వివరాలు చూసుకోవచ్చు. వీటితో పాటు ఎన్ని యూనిట్లు వినియోగించాం. కరెంట్ బిల్లు ఎంత ? ఇతర చార్జీల వివరాలతో కలిపి మొత్తం బిల్లు ఎంత? అనే వివరాలు తెలుసుకోవచ్చు. వీటితో పాటు లైట్, ట్యూబ్ లైట్, ఫ్రిజ్, ఏసీ, కూలరు, ఫ్యాన్, ఐరన్ బాక్స్, గ్లీజరు, వాషింగ్‌మెషన్, టీవీ, మిక్సీ, గ్రైండర్, కంప్యూటర్, నీళ్ల మోటారు వంటి విద్యుత్ పరికరాలు ఎన్ని ఎంత సేపు వాడితే నెలకు ఎన్ని యూనిట్లు రావచ్చనే అంచనా వివరాలు తెలుసుకోవచ్చు. ఇంక సర్వీసు ఏ సెక్షన్ పరిధిలో ఉంది. ఏ ఫీడర్, ఏ సబ్‌స్టేషన్ నుంచి సరఫరా వస్తున్నది. ఏఈ, డీఈ, నంబర్లు కూడా అందుబాటులో ఉంచారు. వీటితో పాటు ఫిర్యాదులు చేసుకునే సౌలభ్యం ఉంది. మీటరు, బిల్లింగ్, సప్లయ్, ఇన్సిడెంట్, ఓల్టేజీ, ట్రాన్స్ ఫార్మర్ వంటి సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చు. ఎవరైనా అద్దె ఇంటిలో నెల మధ్యలో ఇల్లు ఖాళీ చేసినప్పుడు అప్పటివరకు విద్యుత్ వాడకం తెలుసుకునే అవకాశం ఉంటుంది.

యాప్ వాడకం సులభతరం



రిజర్వ్ బ్యాంక్ ఆదేశాల మేరకు ఇకపై విద్యుత్ బిల్లులు ఏపీసీపీడీసీఎల్ యాప్‌లో మాత్రమే చెల్లించాలి. మీ సేవ, గ్రామ సచివాలయాలు, విద్యుత్‌శాఖ ఈఆర్ఓ సెంటర్లలో కూడా చెల్లించవచ్చు. ఇప్పటికే విద్యుత్ శాఖ సిబ్బంది ప్రజలకు యాప్‌పై అవగాహన కల్పిస్తున్నారు. యాప్ చెల్లింపులు నేరుగా సంస్థ ఖాతాలోకి చేరుతాయి. యాప్ అన్ని సౌకర్యాలు కల్పించారు. విద్యుత్ వినియోగంలో ఎటువంటి సమస్యలు ఉన్నా 1912 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేయవచ్చు.

– శ్రీనివాసులు, ఏడీ

జూపాడుబంగ్లా స్టేషన్‌లో బాలిక హత్యకేసు నిందితులు?

జూపాడుబంగ్లా: ముచ్చుమర్రి గ్రామానికి చెందిన బాలిక హత్య కేసు నిందితులను స్థానిక పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చి ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ విచారించినట్లు సమాచారం. గత నెల 7న ముచ్చుమర్రి గ్రామంలో బాలిక అదృశ్యం కాగా పోలీసుల విచారణలో ముగ్గురు మైనర్లు అత్యాచారం చేసి అనంతరం హత్య చేసినట్లు తేలింది. నిందితులుగా ముగ్గురు మైనర్లతోపాటు మృతదేహాన్ని మాయం చేసేందుకు సహకరించారని యోహాన్(నిందితుడి తండ్రి), సద్గురుడులను చేర్చారు. వీరిని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారు. మృతదేహం ఆచూకీ కోసం పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. మరో యోహాన్(నిందితుడి మేనమామ)ను సీసీఎస్ పోలీసులు విచారిస్తుండగా లాకప్‌డెత్ జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈక్రమంలో నిందితులను ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్‌లో విచారిస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై ఎస్‌ఐ లక్ష్మీనారాయణను ఆరాతీయగా తాను సెలవులో ఉన్నట్లు తెలిపారు.

పెళ్లి వేడుకలో రక్తదాన శిబిరం

ఆళ్లగడ్డ: సాధారణంగా పెళ్లి వేడుకలు అంటే బంధుమిత్రుల సందడి.. విందు, చిందు కార్యక్రమాలుంటాయి. అయితే, ఓ జంట ఇందుకు భిన్నంగా ఆలోచించి ఆదర్శమయ్యారు. ఆళ్లగడ్డ మండలం నందింపల్లె గ్రామానికి చెందిన తలారి మహేంద్ర శనివారం సాయిలక్ష్మీదేవిని పెళ్లి చేసుకున్నాడు. కల్యాణ మండపంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. వధూవరులతో పాటు పెళ్లికి హాజరైన బంధుమిత్రులు 20 మంది రక్తదానం చేశారు.

విద్యుత్ సమస్య పరిష్కారం

– శిథిలావస్థకు చేరిన స్తంభం తొలగింపు



విద్యుత్ తీగలు ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

పాములపాడు: మండల కేంద్రంలోని పీర్లచావిడి వద్ద శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉన్న ఇనుప విద్యుత్ స్తంభాన్ని శనివారం తొలగించారు. సర్పంచు మేకల భాగ్యమ్మ సహకారంతో తీగలకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగించారు. నూతన విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసి, విద్యుత్‌ను పునరుద్ధరించడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

షెడ్ల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోండి

జూపాడుబంగ్లా: బర్రెలు, గొర్రెలు, కోళ్ల పెంపకం కోసం రాయితీపై షెడ్ల నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ ఏడీ రామాంజనేయనాయక్, ఏపీఓ గౌరీబాయి తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ ఆరు, నాలుగు, రెండు పశువుల కోసం ఏర్పాటు చేసుకునే విధంగా పశువులకు మూడు రకాల షెడ్ల యూనిట్లు ఉంటాయన్నారు. జీవాలకు, కోళ్లకు రెండు రకాల చొప్పున యూనిట్లు ఉంటాయన్నారు. చిన్న, సన్నకారు రైతులతో పాటు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారు, ఎస్సీ, ఎస్టీలు, అంగవైకల్యం ఉన్న యజమానులు, మహిళా యజమానులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు ఫారం, ఉపాధి హామీ జాబ్‌కార్డు, ఆధార్‌కార్డు, స్థలహక్కు పత్రం, బ్యాంకు పాసుపుస్తకం జిరాక్స్ కాపీలతో ఉపాధిహామీ పథకం కార్యాలయంలో సంప్రదించాలని వారు తెలిపారు.

నిరుపయోగంగా తాగునీటి ట్యాంక్



నిరుపయోగంగా మారిన మినీ సిస్టమ్ తాగునీటి ట్యాంక్

పగిడ్యాల: మండలంలోని తూర్పు ప్రాతకోట ఎస్సీ కాలనీ వద్ద నిర్మించిన మినీ సిస్టమ్ తాగునీటి ట్యాంక్ నిరుపయోగంగా మారింది. కొద్ది రోజులుగా ట్యాంక్‌కు నీరు సరఫరా చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంక్ వద్ద ప్రత్యేకంగా బోర్ వేసి 1హెచ్‌పీ మోటర్‌ను అమర్చినా సకాలంలో ట్యాంక్‌కు నీరు సరఫరా చేయనందున నానా అవస్థలు పడుతన్నామని వాపోతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి ట్యాంక్‌కు నీటి సరఫరాను పునరుద్ధరించి దాహార్తిని తీర్చాలని కాలనీవాసులు వేడుకుంటున్నారు.